నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, శుక్రవారం 17 జనవరి 2025 | MAHABUBNAGAR NARAYANPET

జైపాల్‌రెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

దేశ రాజకీయాల్లో జైపాల్ స్థానం చిరస్మరణీయం

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- హైదరాబాద్‌లోని జైపాల్ సమాధి వద్ద నివాళి

వనపర్తి టౌన్, జనవరి 16: దేశ రాజకీయాల్లో కేంద్ర మాజీ మంత్రి, ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డుగ్రహీత సూదిని జైపాల్‌రెడ్డిది చిరస్మరణీయ స్థానమని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి కొనియాడారు. జైపాల్‌రెడ్డి జయంతి సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని నెక్లెస్ రోడ్డులోని సమాధికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. నిష్కల్మశమైన రాజకీయ జీవితాన్ని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం జైపాల్‌రెడ్డి చేసిన కృషిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభించాలని రాస్తారోకో చేస్తున్న కరివెన, చౌలతండావాసులు

బీటీరోడ్డు నిర్మించాలని రాస్తారోకో

- కేసీఆర్ ప్రభుత్వంలో చౌలతండా స్టేజీ -కరివెన వరకు రోడ్డుకు రూ.2.20 కోట్లు మంజూరు
- ప్రజాపాలన సర్కారు ఏర్పడి 14 నెలలైనా ఇంకా ప్రారంభంకాని రహదారి పనులు

భూత్పూర్, జనవరి 16: మండలంలోని చౌలతండా నుంచి కరివెన వరకు బీటీ రోడ్డు నిర్మించాలని తండావాసులు గురువారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా మాజీ ఉపసర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చౌలతండా స్టేజీ నుంచి కరివెన వరకు రూ.2.20కోట్లు మంజూరు కాగా.. 2023లో శంకుస్థాపన కూడా చేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 14నెలల వుతున్నా బీటీరోడ్డు పనులు మొదలు పెట్టక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. రోడ్డు లేక ప్రయాణం నరకప్రాయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే బీటీ పనులను చేయాలని, లేదంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనునాయక్, మల్లయ్య, మల్లేశ్‌తో పాటుకరివెన, చౌలతండావాసులు పాల్గొన్నారు.

చందాలు పోగేసి..

- గుంతలమయమైన రోడ్డుపై మట్టి వేయించుకున్న ఎల్కూర్ వాసులు

మల్దకల్, జనవరి 16: మండలంలోని ఎల్కూర్‌లోని 14వ వార్డులో ఇంటికి రూ.5వేలు చందాలు వేసుకొని రోడ్డుపై మట్టి వేయించుకొన్న ఘటన చోటుచేసుకున్నది. రోడ్డుపై మట్టి వేయించాలని పాలకులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోక పోవడంతో వార్డు ప్రజలు విసిగిపోయారు. ఏండ్లుగా దారి పొడవునా నీళ్లు నిలిచి నరకయాతన పడేవారు.

సొంత డబ్బుతో రోడ్డు వేయించుకుంటున్న దృశ్యం

కల్లుసీసాలో పాముపిల్ల కలకలం

- లట్టుపల్లిలో దుకాణం నిర్వాహకులపై ఆగ్రహం
- సీసాలను ధ్వంసం చేసిన స్థానికులు
- దవాఖానలో చికిత్సలు చేయిస్తామని హామీ ఇవ్వడంతో శాంతించిన స్థానికులు

కల్లుసీసాలో వచ్చిన చనిపోయిన పాముపిల్లను చూపుతున్న బాధితుడు

బిజినేపల్లి, జనవరి 16: మండలంలోని లట్టుపల్లి కల్లు దుకాణం వద్ద సీసాలో పాముపిల్ల బయటపడిన ఘటన గురువారం చోటుచేసుకున్నది. ఆగ్రహించిన గ్రామస్తులు దుకాణం వద్ద ఆందోళన చేపట్టి కల్లు సీసాలను ధ్వంసం చేశారు. స్థానికుల కథనం ప్రకారం.. ఎర్రకుంట తండా జీపీలోని రావుల తెవు తండాకు చెందిన మాన్యా నాయక్ రోజూ మాదిరి గానే కల్లు దుకాణానికి వచ్చాడు. దుకాణంలో కల్లు కొనుగోలు తాగుతుండగా చనిపోయిన పాముపిల్ల నోట్లోకి రావడంతో భయాందోళనకు గురయ్యాడు. గమనించి చూడగా పాముపిల్లగా గుర్తించి ఆశ్చర్యానికి గురయ్యాడు. చుట్టుపక్కల వారు గమనించి కల్లు దుకాణం నిర్వాహకులను నిలదీశారు. అంతేకాకుండా దుకాణం వద్ద చుట్టుపక్కల వారు, గ్రామస్తులు పెద్ద ఎత్తున గుమిగూడి ఆందోళన చేశారు. ప్రతి నిత్యం కూలీ పనులు చేసి సేదతీరేందుకు కల్లు తాగడానికి వస్తే ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం ఏంటని ప్రశ్నించారు. కల్లు తయారు చేసే క్రమంలో శుభ్రత, పరిశీలన లేక పోవడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. సంబంధిత దుకాణం యజమానులపై చర్యలు తీసుకోవాలని ఆందోళనకు దిగారు. ఆగ్రహానికి గురైన మరి కొంత మంది గ్రామస్తులు దుకాణంలోని సీసాలు, సామగ్రిని ధ్వంసం చేశారు. చివరకు నిర్వాహకులు సంబంధిత బాధితుడిని దవాఖానలో చేర్పించి చికిత్స చేయిస్తామనడంతో ఆందోళన విరమించారు.



ఆగ్రహంతో కల్లు సీసాలను ధ్వంసం చేసిన గ్రామస్తులు

మార్చి 21 నుంచి ఎస్ఎస్‌సీ పరీక్షలు

మరో 64 రోజుల్లో ప్రారంభమయ్యే పరీక్షల్లో మార్క్ చూపాలంటే 'పది'ంతల ప్రణాళిక అవసరం. ఇందుకోసం నిత్యం ప్రిపరేషన్ అవసరమని ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. మెళకువలు, రివిజన్ ప్రధానమని.. ఫాలో అవుతేనే ఎస్ఎస్‌సీ పరీక్షల్లో మంచి ఫలితాలు వస్తాయని చెబుతున్నారు. గతేడాది రిజల్ట్స్‌కన్నా మెరుగైన ఫలితాలు సాధించేలా ఇప్పటికే ఎడ్యుకేషన్ శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. తెలుగును సులువుగా చదివేలా.. సాధనతోనే హిందీలో మార్పు లొచ్చేలా.. ఆంగ్లంపై ఆందోళన లేకుండా.. భౌతికమక' పడకుండా.. లెక్క తప్పకుండా.. సాంఘిక శాస్త్రంలో చరిత్ర సృష్టించేలా.. విద్యా శాఖాధికారులు అడుగులు వేస్తున్నారు.

– మహబూబ్‌నగర్ కలెక్టరేట్, జనవరి 16

పదింతల ప్రణాళిక

- వార్షిక పరీక్షలకు ఇంకా 64 రోజులే..
- విద్యార్థులకు ప్రిపరేషన్ తప్పనిసరి
- ఫాలో అయితే విజయం మీదే..
- మెళకువలు, రివిజన్ ప్రధానమంటున్న ఆయా సబ్జెక్టుల నిపుణులు
- గతేడాది ఫలితాలు దాటేలా విద్యాశాఖ లక్ష్యం

విద్యార్థి జీవితంలో పదో తరగతి కీలకం. ఈ ఏడాది మార్చి 21 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సన్నద్ధతకు ఉపాధ్యాయుల కృషితో పాటు తల్లిదండ్రులు సహకారం ముఖ్యం. ఇప్పటి నుంచే ప్రణాళిక ప్రకారం ప్రిపరేషన్ మొదలు పెడితేనే విజయం సాధించగలుచ్చు. గతేడాది ఎస్ఎస్‌సీ ఫలితాల్లో మహబూబ్‌నగర్ జిల్లా రాష్ట్ర స్థాయిలో 28, నారాయణపేట 15, నాగర్‌కర్నూల్ 23, వనపర్తి 29, జోగుళాంబ-గద్వాల జిల్లా 32వ స్థానాల్లో నిలిచాయి. లాస్ట్ ఇయర్ రిజల్ట్ పునరావృతం కాకుండా.. రాష్ట్రస్థాయిలో టాప్ 10లో ఉండేలా.. మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నది. ఇప్పటికే అన్ని సబ్జెక్టులకు సిలబస్ పూర్తి కాగా.. ఫిబ్రవరి వరకు మరోసారి రివిజన్ చేయనున్నారు. మాదిరి పరీక్షల ప్రశ్నాపత్రాలను అందించి సన్నద్ధం చేస్తున్నట్లు జిల్లా విద్యా శాఖ అధికారులు తెలిపారు. విద్యార్థులు బాగా చదివేలా వారి తల్లిదండ్రులు సైతం చొరవ తీసుకోవాల్సి ఉన్నది.

64 రోజుల గడువే..

పది పరీక్షలకు 64 రోజుల గడువే మిగిలింది. ఈ నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు ప్రణాళిక ప్రకారం అడుగులు వేయాల్సిన అవసరం ఉన్నది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో గతేడాది సామాన్య శాస్త్రం, ఆంగ్లం, గణితం, సాంఘిక శాస్త్రం సబ్జెక్టుల్లో విద్యార్థులు అధికంగా తప్పారు. ఈసారి విద్యా శాఖ అధికారులు పక్కాగా అడుగులు వేయాల్సిన అవసరం ఉన్నది. గతేడాది విద్యార్థులు అధికంగా తప్పిన సబ్జెక్టులపై దృష్టి సారించాలి. ముఖ్యంగా రెగ్యులర్ తరగతులతో పాటు, ప్రత్యేక తరగతుల్లో అభ్యాస దీపిక ప్రశ్నలను విద్యార్థులతో నిత్యం సాధన చేయించాలి. రివిజన్‌లో భాగంగా ప్రతిరోజు పాఠం వివరించి, మరుసటి రోజు దానిపై పరీక్ష నిర్వహించాలి. విద్యార్థులు చేసిన తప్పులను గుర్తించి మరోసారి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పరీక్షల్లో మంచి మార్కులు రావాలంటే చేతి రాత కీలకమని తెలిపి, మెరుగుపర్చడానికి కృషి చేయాలి. పాత ప్రశ్నాపత్రాలతో జవాబులు రాయించాలి. పదిలో తక్కువ సమయాలు సులభంగా పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశాలపై గణితం, ఆంగ్లం, సైన్స్, సాంఘిక శాస్త్రఉపాధ్యాయులు తమ అభిప్రాయాలు వెల్లడించారు.

ఉమ్మడి జిల్లాలో 4,182 పాఠశాలలు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు మొత్తం 4,182 ఉన్నాయి. వాటి పరిధిలో 5.42 లక్షల మందికిపైగా బాల బాలికలు చదువుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో హైస్కూళ్లు 287, నాగర్‌కర్నూల్ జిల్లాలో 236, జోగుళాంబ-గద్వాల జిల్లాలో 154, వనపర్తి జిల్లాలో 192, నారాయణపేట జిల్లాలో 139 ఉన్నాయి. గతేడాది మార్చి-2024లో ఉమ్మడి పాలమూరులోని నారాయణపేట జిల్లాలో 7,655 మంది, నాగర్‌కర్నూల్‌లో 10,507, మహబూబ్‌నగర్ జిల్లాలో 12,673, వనపర్తి జిల్లాలో 6,899, జోగుళాంబ గద్వాల జిల్లాలో 7,175 మంది విద్యార్థులు పదితరగతి పరీక్షలు రాశారు.

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో పదో తరగతి విద్యార్థులకు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

అన్వయించుకుంటే అ'సామాన్య' ఫలితం

దైనందిన జీవితంలో సైన్స్ సూత్రాలను అన్వయించుకుంటూ ముందుకు సాగటంతో సామాన్య శాస్త్రంపై పట్టు పెరుగుతుంది. గత ప్రశ్నాపత్రాల తోపాటు ప్రయోగ విధానంపై దృష్టి సారించాలి. ప్రతి పాఠంలో బొమ్మలను సాధన చేస్తూ వాటి భాగాలను గుర్తించాలి. పట్టికల విశ్లేషణ ముఖ్యమైన అంశం. ప్రయోగ విధానాలు, పరికల్పనలు, బొమ్మలు గీయటం, పట్టికల సాధనతో అధిక మార్కులు సాధించవచ్చు. విద్యార్థులు బాగా చదివేలా వారి వారి తల్లిదండ్రులు దోహదపడాలి.

- పీ.సాయిబాబా, సామాన్య శాస్త్రం ఉపాధ్యాయుడు, మహబూబ్‌నగర్

లెక్కల్లో గట్టెక్కాలంటే..

గణితంలో ప్రతి ప్రశ్నకు దత్తాంశం రాస్తే మార్కులు కేటాయిస్తారు. దత్తాంశం రాయడం ప్రాక్టీస్ చేయాలి. 3వ, 4వ, 14వ అధ్యాయాలలోని గ్రాఫ్ ప్రశ్నలు, 8వ, 9వ అధ్యాయనంలోని నిర్మాణాలకు సంబంధించిన ప్రశ్నలు నేర్చుకోవడం, 10వ, 14వ అధ్యాయనాల్లోని సూత్రాలు బాగా ప్రాక్టీస్ చేస్తే మార్కులు పొందొచ్చు. సమితులు అధ్యాయంలోని వెన్ చిత్రాలు గీయడం, త్రికోణమితి అనువర్తనాలు అధ్యాయంలోని పద సమస్యలకు పటాలు గీయడం బాగా ప్రాక్టీస్ చేయాలి. ప్రతి అధ్యాయంలోని నిరూపణ చేసే సమస్యలు ప్రాక్టీస్ చేయాలి. పార్ట్-బీకి 20 మార్కులు కేటాయించబడ్డాయి. ప్రీవియస్ ప్రశ్నాపత్రాలలో వచ్చిన ప్రశ్నలు బాగా ప్రాక్టీస్ చేయాలి.

- ఎండీ.ఫసియొద్దీన్, గణితం ఉపాధ్యాయుడు, మహబూబ్‌నగర్

ఆంగ్లంలో అక్షర దోషాలు ఉండొద్దు

తెలుగు మాధ్యమం విద్యార్థులు ఆందోళన చెందొద్దు. సారాంశాన్ని గ్రహించి సొంతంగా నోట్స్ రాసుకోవాలి. పార్ట్ ఏ, బీ, సీ సెక్షన్‌పై అవగాహన పెంచుకోవాలి. అక్షర దోషాలు ఉండొద్దు. టెక్స్ట్ డిపెండెంట్, ఇండిపెండెంట్ అంశాలపై పట్టు సాధించాలి. పద్యభాగంలో ముఖ్య పదాలు, యాంటానిమ్స్, సినానిమ్స్‌పై దృష్టి సారించాలి. పార్ట్స్ ఆఫ్ స్పీచ్, డైరెక్ట్, ఇన్‌డైరెక్ట్ స్పీచ్.. యాక్టివ్ వాయిస్, వ్యాసాలను చదవటంతో పాటు సాధన చేయాలి.

- బ్యూలా, ఆంగ్ల ఉపాధ్యాయురాలు, మహబూబ్‌నగర్

ఉత్తమ ఫలితాలకు ప్రత్యేక ప్రణాళిక

ఈ ఏడాది పదిలో ఉత్తమ ఫలితాలు సాధించడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. గత వార్షిక ఫలితాల్లో సాధించిన ఫలితాల కంటే మరింత మెరుగైన స్థానాన్ని సాధించేందుకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సమిష్టి కృషి అవసరం. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించాం. గతేడాది తక్కువ ఫలితాలు వచ్చిన పాఠశాలల్లో ఆ పరిస్థితి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. గత సంవత్సరం కంటే మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు కృషి చేస్తాం.

- ఏ.ప్రవీణ్‌కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి, మహబూబ్‌నగర్

సాంఘిక శాస్త్రం.. అవగాహనే కీలకం

తేలికైన వాటిని ముందుగా చదివి కఠిన అంశాలను బాగా సాధన చేయాలి. పటాల నైపుణ్యాలు, సమాచార నైపుణ్యాలు, ప్రశంస సున్నితత్వం, ఇచ్చిన అంశాన్ని చదివి వ్యాఖ్యలు రాయటంపై దృష్టి సారించాలి. పటాలు, పట్టికలు, గ్రాఫ్‌లపై పట్టుంటే ఎక్కువ మార్కులొస్తాయి. పాత ప్రశ్నాపత్రాలను పరిశీలించాలి. 'అభ్యాస దీపిక'లోని అంశాలను బాగా చదవాలి.

- కే.కవిత, సాంఘికశాస్త్రం ఉపాధ్యాయురాలు, మహబూబ్‌నగర్

ట్రాక్టర్‌కు నిప్పుపెట్టిన దుండగులు

మరికల్, జనవరి 16 : మండలంలోని పుసాల్‌పాడ్‌లో మున్నూరు సుదర్శన్‌కు చెందిన ట్రాక్టర్ ఇంటి ఎదుట ఉండగా, బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో దగ్ధమైంది. బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాము తెలిపారు. అలాగే తీలేరు పరిధిలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని బైక్‌పై వెళ్తున్న కురుమూర్తికి గాయాలయ్యాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు

వావిలాలలో బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉత్సాహంగా బండలాగుడు పోటీలు

ఇటిక్యాల, జనవరి 16 : మండలంలోని వావిలాలలో వెలిసిన శివాంజనేయస్వామి జాతర ఉత్సవాలను పురస్కరించుకొని గురువారం గ్రామంలో వృషభరాజ ముల బలప్రదర్శన (బండలాగుడు)పోటీలు నిర్వహించారు. ఆరుపండ్ల విభాగంలో పాణ్యంకు చెందిన విజయమ్మ, వెంకటకృష్ణయ్య వృషభరాజములు 3,936 ఫీట్ల దూరం లాగి రూ.40వేలు ప్రథమ బహుమతి, సాతర్లకు చెందిన హర్ధద్‌బాషా, అబ్దుల్‌బాషా వృషభరాజములు 3,600ఫీట్లు లాగి రూ.30వేలు ద్వితీయ బహుమతి, పెద్దదగడకు చెందిన యశ్వంత్‌యాదవ్ వృషభరాజములు 3,500 ఫీట్ల దూరం లాగి రూ.15వేలు తృతీయ బహుమతి, ఉండవెల్లి మండలం కంచుపాడుకు చెందిన ఆంజనేయరెడ్డి వృషభరాజ ములు 3,394 ఫీట్లతో నాలుగో బహుమతి రూ.10వేలను, మల్దకల్ మండలం అమరవాయికి చెందిన గోవర్ధన్ వృషభరాజములు 3,284 ఫీట్ల దూరం లాగి రూ.5వేలు ఐదో బహుమతి గెలుపొందాయి. స్థానికులు ఉత్సాహంగా పోటీలను తిలకించారు. అనంతరం నిర్వాహకులు బహుమతులు అందజేశారు.

అలరించిన పొట్టేళ్ల పందెం

- వావిలాలలో పాల్గొన్న 13 పొట్టేళ్లు

ఇటిక్యాల, జనవరి 16 : వావిలాలలో వెలిసిన శివాంజనేయస్వామి జాతర ఉత్సవాల సందర్భంగా గురువారం పొట్టేళ్ల పందేలను నిర్వహించారు. మొత్తం 13 పొట్టేళ్లు పాల్గొనగా.. మొదటి బహుమతి నంద్యాల జిల్లా తిమ్మాపూర్‌కు చెందిన హనుమకు చెందిన పొట్టేలుకు రూ.20వేలు, అయిజ మండలం బింగుదొడ్డికి చెందిన పరశురాముని పొట్టేలు ద్వితీయ బహుమతి రూ.15వేలు, కర్నూల్ జిల్లా కొడుమూర్ నియోజకవర్గం ముల్లగుర్తికి చెందిన భైరవ పొట్టేలు తృతీయ బహుమతిగా రూ.10వేలు, అయిజకు చెందిన నర్సింహ పొట్టేలు నాలుగో బహుమతిగా రూ.5వేలు గెలుపొందాయి. అనంతరం విజేతలకు బహుమతులను శివాంజనేయస్వామి పేరిట గ్రామపెద్దలు ప్రదానం చేశారు.

వావిలాలలో పందెంలో తలపడుతున్న పొట్టేళ్లు